ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 9 మార్చి 2024





ఆలయ ఆవరణలో జాగరణ దీపాలను వెలిగించిన భక్తులు



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శంభో శంకర

- శివనామ స్మరణతో మార్మోగిన రాజన్న క్షేత్రం
- వేములవాడలో కన్నుల పండువగా మహాశివరాత్రి వేడుకలు
- స్వామివారికి ఘనంగా మహాలింగార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

ఆపదమొక్కుల దేవుడు వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి పుణ్యక్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం శుక్రవారం భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకొని తరించారు. అనంతరం కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసం పాటించి రాత్రంతా జాగరణ చేశారు. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రధానమైన మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు రాజరాజేశ్వరస్వామివారికి నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించి పప్పుబెల్లాలు పంచిపెట్టారు. రద్దీ అధికంగా ఉండడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. మహాలింగార్చన, లింగోద్భవ సమయంలో ఋత్విజులు, వేదపండితులు, అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు.

■ వేములవాడ

7 పేజీలో



ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు





బారులుదీరిన శివస్వాములు



వేములవాడ ఆలయ ఏరియల్ వ్యూ

వేములవాడ రాజన్న సేవలో ప్రముఖులు







ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు, హైకోర్టు న్యాయమూర్తి సురేందర్‌కు, జడ్పీ చైర్‌పర్సన్ అరుణకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ప్రముఖులు వారి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె సురేందర్ స్వామివారి సేవలో తరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో హరికిషన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, వేములవాడ సబ్ జడ్జి రవీందర్, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్, జ్యోతిర్మయి, సుజన సకుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన స్వామివారిని దర్శించుకోగా, స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ ఆయనకు స్వామివారి ప్రసాదం అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్, వేములవాడ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

● రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్

రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ సినీ రచయిత విజయేంద్రప్రసాద్ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. విజయేంద్రప్రసాద్‌కు స్థానిక శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వాగతం పలికి పూజల అనంతరం స్వామివారి ప్రసాదం అందజేశారు.

● స్వామివారిని దర్శించుకున్న మంత్రి పొన్నం, ఎంపీ బండి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లింగోద్భవ సమయంలో నిర్వహించిన స్వామివారి మహాన్యాస రుద్రాభిషేకం పూజలో పాల్గొన్నారు.

● ఎంపీ బండిసంజయ్‌కుమార్ రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి స్వామివారి ప్రసాదం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆయన వెంట ఉన్నారు.

● మహాశివరాత్రి జాతర ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ టౌన్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆలయ పరిసరాలతో పాటు భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ నాగేంద్రచారి, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆర్డీవో, ఎమ్మార్వో మహేష్‌కుమార్, టౌన్ సీఐ కరుణాకర్ జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమన్వయం చేశారు.

● క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు

మహాశివరాత్రి జాతరను పురష్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చారు. కాగా శుక్రవారం తెల్లవారు జామున లోకల్, వీఐపీ దర్శనాల సందర్భంగా రెండు గంటలపాటు సాధారణ భక్తుల లైన్‌లను నిలిపివేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షిస్తున్నామని క్యూలైన్‌లు త్వరగ కదిలేలా చేయాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

● సీసీ కెమెరాల నిఘా నీడలో..

శివరాత్రి జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సుమారు 200 సీసీ కెమెరాలు పట్టణ పరిధిలోని సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేశారు. నిత్యం పర్యవేక్షణ చేస్తూ అవాంతరాలు జరిగే ప్రదేశాలు, ట్రాఫిక్ అంతరాయం ఉన్న ప్రాంతాల్లో ఉన్న సిబ్బందికి సెట్ కమ్యూనికేషన్ ద్వారా సూచనలు చేస్తూ ట్రాఫిక్ సమస్యలు తలేత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.





రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్‌కు ప్రసాదం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

శివస్వాముల మాలవిరమణ

వేములవాడ టౌన్: మహాదేవుడికి మండల దీక్ష, అర్ధ మండల దీక్ష చేపట్టిన శివస్వాములు సోమవారం మాలవిరమణ చేశారు. మహాశివ రాత్రి పర్వదిన్నాన్ని పురస్కరించుకుని శివస్వాములు ఆయా సన్నిధానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి డీజే సౌండ్స్‌లతో, ఒగ్గు కళాకారుల నృత్యాలతో శివనామస్మరణతో పట్టణ పురవీదుల్లో శోభాయాత్ర నిర్వహించారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన పంచామృతాలతో శివస్వాములు ఆలయంలోకి ప్రవేశించి దర్శనం చేసుకున్నారు. కార్యక్ర మంలో గురుస్వాములు మచ్చ కిషన్, రాపెల్లి శ్రీధర్, గుంటి కనుకయ్య, చేపూరి రవీందర్, చౌటపల్లి శ్రీకాంత్, ఎర్రం శేఖర్, సాయి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

'గృహజ్యోతి'తో నిరుపేదల ఇళ్లకు వెలుగులు



పెద్దూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 8: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గృహజ్యోతి పథకం నిరుపేదల ఇళ్లకు వెలుగులను నింపాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సెస్ అధికారులు, సిబ్బంది ఇళ్లలో కరెంట్ మీటర్లకు గృహజ్యోతి పథకం బిల్లులను అందిస్తుండగా వాటిని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరుపేదలకు అందించారు. అనంతరం గ్రామ బస్టాండ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా ఇప్పటివరకు నాలుగింటిని అమలు చేసిందన్నారు. మిగిలిన రెండు పథకాలను సైతం సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చుతారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంబీరావుపేట ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, పట్టణ ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల తిరుపతిగౌడ్, వార్డు యూత్ అధ్యక్షుడు నీరటి శ్యాం, సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, అతికం నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

డెంగ్యూతో ఒకరి మృతి



రాములు(ఫైల్)

కోనరావుపేట, మార్చి 8: రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారంగ్రామానికి చెందిన పిట్టల రాములు (55) అనే వ్యక్తి డెంగ్యూతో శుక్రవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాములు రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు అనుపత్రిలో చూపించగా రక్తకణాలు తగ్గాయని, డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని కుటుంబసభ్యులకు సూచించా రు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య రేణుకు, కూతురు రమ్య, కుమారులు శ్రీకాంత్, ప్రశాత్‌లుఉన్నారు.

కుక్కల దాడిలో మేకల మృతి

కోనరావుపేట, మార్చి 8: కోనరావుపేట మండలం కొండాపూర్‌లో కుక్కలు దాడి చేసి గొర్రె, మేక పిల్లలను చంపివేశాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన బెదిరే రాములుకు చెందిన మేక, గొర్రె పిల్లలను ఇంటి వద్దనే కంచే వేసి అందులో ఉంచి మేక, గొర్రెలను మేత కోసం తీసుకవెళ్లాడు. శుక్రవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి నాలుగు గొర్రెలు, 5 మేక పిల్లలను కుక్కలు దాడి చేసి చంపివేశాయి. కుక్కల దాడిలో మృతిచెందిన మేకలను చూసి భోరున విలపిస్తూ రూ లక్ష వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అదుకోవాలని వేడుకుంటున్నారు.

అడవి నుంచి జనంలోకి వచ్చిన దుప్పి



దుప్పిని కాపాడిన గ్రామస్థులు

కోనరావుపేట, మార్చి 8: ఓ చుక్కల దుప్పి దాహార్తిని తీర్చుకోవడం కోసం అడవి నుంచి గ్రామ శివారులోకి వచ్చింది. దుప్పిని చూసిన కుక్కలు వెంట పడి తరమగా కోనరావుపేట గ్రామంలోకి చేరింది. వెంటనే గమనించిన గ్రామస్థులు దుప్పిని పట్టుకోని కుక్కల ను చెదరగోట్టి దాని దాహార్తిని తీర్చి అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 8: ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను ఆదివారం ఉదయం 8 గంటలకు గోదావరిఖని సింగరేణి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ డబ్ల్యూ గణపతి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తికల క్రీడాకారులు పాల్గొనా లన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

కొడిమ్యాల, మార్చి 8: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన సిరిమల్ల దేవయ్య(58)అనే వ్యక్తి మతిస్థిమితం లేక మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామ శివారులో గల బావి పక్కన వేప పుల్లను తెంపటానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివ రాల మేరకు దేవయ్యకు కొంత కాలంగా మతి స్థిమితం సరిగా లేని కారణంగా ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈత రాని కారణంగా కాలు జారి బావిలో పడి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుని భార్య సిరిమల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ప్రతినిధులు


ఏర్పాట్లను తెలుసుకుంటున్న కలెక్టర్


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

శంభోశంకర

- శివనామ స్మరణతో మార్మోగిన రాజన్న క్షేత్రం
- వేములవాడలో కన్నుల పండువగా మహాశివరాత్రి వేడుకలు
- స్వామివారికి మహాలింగార్చన, మహా న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

వేములవాడ, మార్చి 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆపదమొక్కుల దేవుడు రాజరాజేశ్వరస్వామివారి పుణ్యక్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని తరించారు. ఉదయం నుంచి ఉపవాసం పాటించి రాత్రంతా జాగరణ చేశారు. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రధానమైన మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కోడెమొక్కును చెల్లించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు రాజరాజేశ్వరస్వామి వారికి నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి పప్పు బెల్లాలు పంచిపెట్టారు. రద్దీ అధికంగా ఉండడంతో స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది.

● ఘనంగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి 11-35 గంటలకు లింగోద్భవ సమయంలో ఋత్విజులు, వేదపండితులు, అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సాయంత్రం 6-05 గంటల నుంచి స్వామివారి కల్యాణమండపంలో మహాలింగార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకారంలో అమర్చిన దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలందుకున్న సమయంలో రాజరాజేశ్వర స్వామివారిని లక్షలాది మంది భక్తులు దర్శించుకుని తరించగా, వేలాది మంది భక్తులు జాగరణ పాటించారు. ఆలయ పరిసరాలు, గుడిచెరువు ప్రాంగణంలోని బహిరంగప్రదేశంలో రోజంతా ఉపవాసం ఉండి మట్టితో శివలింగాలు, ప్రమిదలు రూపొందించి దీపాలు వెలిగించారు. నైవేద్యం సమర్పించి, రాత్రంతా మెలకువతో ఉండి స్వామివారిని కొలిచి తరించారు.


కాంతులీనుతున్న రాజన్న ఆలయం

భక్తులు స్వామివారికి నిలువెత్తు బంగారం (బెల్లం) పంచిపెట్టారు. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ పరిసరాలు కలియతిరుగుతూ ఉత్సవాల ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, భీమ్యానాయక్, ఆర్డీవో ఎస్ రాజేశ్వర్, ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్, తహసీల్దార్ మహేశ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

● శృంగేరి శారదాపీఠం తరపున పట్టువస్త్రాల సమర్పణ..

మహాశివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వరస్వామి వారికి శృంగేరి శారదా పీఠం తరఫున పట్టు వస్త్రాలు అందజేశారు. శృంగేరి ఆస్థాన పండితులు వ్యాసోజుల రాధాకృష్ణశర్మ పట్టు వస్త్రాలు తీసుకురాగా, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి అందజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణశర్మకు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.


భక్తులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్


యాత్రికుల వాహనాలు


దర్శనం కోసం వెళ్తున్న శివస్వాములు


ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


వేములవాడలో భక్తుల సందడి


చలువ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు


భక్తులకు పండ్లు అందజేస్తున్న వలంటీర్లు


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు

- భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు
- విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

జగిత్యాల, మార్చి8: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాపల్లె శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి జాతర సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పది ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. పోటీల్లో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన కొట్లపెల్లి సాగర్ ప్రథమ విజేతగా నిలిచి దాతరాపల్లె గ్రామానికి చెందిన కొక్కుల పద్మ-జలేందర్ దంపతులు అందించిన పావు తులం బంగారంను కైవసం చేసుకున్నారు. మండలంలోని తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషమియా రెండో విజేతగా నిలిచి రాపల్లె గ్రామానికి చెందిన దాత ఎక్కల్‌దేవి పద్మ-మల్లయ్య యాదవ్ అందించిన 10 తులాల వెండిని గెలుచుకోగా, మూడో విజేతగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జాడి కిట్టు నిలవగా దాత ఎడ్ల మల్లారెడ్డి అందించిన 5 తులాల వెండిని గెలుచు కున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతర సందర్భంగా ప్రజలకు ఉత్సాహం, ఉల్లాసం కలిగించేందుకు పోటీలు నిర్వహించామని తెలిపారు. ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు నల్ల శ్యామ్, మారంపల్లి బాబు, కొక్కుల భూమయ్య, గండ్ర సత్యంరావు, ఆలయ కమీటీ చైర్మన్ గండ్ర రామారావు, వైస్ చైర్మన్ సత్తయ్య, మల్లేశం, నాయకులు మారంపల్లి మల్లయ్య, కోలా శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, గంగాధర్, శేఖర్, కోలా రాములు, తదితరులు పాల్గొన్నారు.


రాపల్లెలో ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వీణవంక తహసీల్దార్ సస్పెన్షన్

వీణవంక, మార్చి 8: వీణవంక మండలంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న తిరుమల్‌రావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన రామిడి శివప్రియ అమెరికాలో ఉంటారు. ఆమె పేరుపై ఉన్న 16 గుంటల భూమిని ధరణి ఆపరేటర్ అరుణ్ ముగ్గురు వ్యక్తుల పేరుపై అక్రమంగా పట్టా చేశాడు. ఆ సమయంలో తహసీల్దార్ తిరుమల్‌రావు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ధరణి ఆపరేటర్ అరుణ్ తహసీల్దార్ డిజిటల్ కీని ఉపయోగించి ఈ అక్రమ పట్టా చేశాడు. ఈ విషయం తెలుసుకున్న తిరుమల్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆమె విచారణ జరిపించి విదేశాల్లో ఉన్న మహిళకు సంబంధించి భూమిని ఇతరులకు పట్టా చేసేటప్పుడు కనీస నిబంధనలు పాటించలేదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు తహసీల్దార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

నేటి నుంచి మెడికల్ రిప్రజంటేటివ్స్ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 8: తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజుభట్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం అన్ని రకాల మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తొలగించాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేదించాలని, అన్నారు. ప్రభుత్వం ఫార్మ, వ్యాక్సిన్ సంస్థలను పునరుద్ధరించాలని, ఫార్మ రంగంలో అనైతిక కార్యక్రమాలను అరికట్టాలని, యూసీపీఎంపీ కోడ్‌ను అమలు చేయాలని వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ కోసం ఏర్పాటు చేయబడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ని పరిరక్షించాలని, అన్ని ఫార్మా కంపెనీలు ఫారం ఏ లో అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తమకు పని విధానాలను రూపొందించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి వెంకటేశ్, జాతీయ సహాయ ప్రధాన కార్యదర్శి కె సునీల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ భానుకిరణ్, ఉపాధ్యక్షుడు జి విద్యాసాగర్, సహాయ ప్రధాన కార్యదర్శి, జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎ నాగేశ్వర్‌రావు, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు కె ఐల య్య, సిహెచ్ శ్రీదర్, ఎ సదానందచారి, సయ్యద్ సిద్ధిఖి, ముకుంద్‌కులకర్ణి, పి ము రళి, పీవీఎస్‌పి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గుండా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, అంజయ్య, ఉపాధ్యక్షుడు పి నరేందర్, శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శులు కె సంపత్‌రెడ్డి, కె రమేశ్, కోశాధికారి కె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీకి నందెల్లి మహిపాల్

కరీంనగర్ క్రైం, మార్చి 8: భూకబ్జాకు సంబంధించిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మహిపాల్‌పై నమోదైన కేసులో మరింత లోతుగా విచారణ జరిపేందుకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా 24 గంటల పోలీసు కస్టడీకి అనుమతించింది. దీంతో ఉదయం 11 గంటలకు మహిపాల్‌ను కస్టడీకి తీసుకుని కరీంనగర్ రూరల్ ఠాణాకు తరలించి విచారణ జరుపుతున్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని జీనియస్ చదరంగ అకాడమీలో ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలను నిర్వహించనున్నామని జీనియస్ చదరంగ అకాడమీ కోచ్ కంకటి అనిల్‌కుమార్ తెలిపారు. ముగ్గురు విజేతలకు రూ.5వేల చొప్పున నగదు బహుమతి, పది మందికి ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు.

వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుంది

- మన లక్ష్యానికి అండగా ఉన్నవారికే మద్దతు - ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

సుభాష్‌నగర్, మార్చి 8: ఎస్సీ వర్గీకరణకు 29 సంవత్సరాలుగా జరుగుతున్న పోరాటం అంతిమ దశకు చేరుకుందని, తమ లక్ష్యాలకు అండగా ఉన్నవారికే మద్దతుగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల కరీంనగర్ పార్లమెంట్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ మినహా దేశంలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను మోసం చేశాయని చెప్పారు. 2004లో వర్గీకరణ విషయాన్ని కొట్టివేయడంలో కాంగ్రెస్ పార్టీతో పాటు కొంత మంది కుట్రలు చేశారని ఆరోపిం చారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ముందడుగు వేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే పార్టీలకు మనం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌తోపాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎం ఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఇంజం వెంకటస్వామి, తుంగ ఆంజనేయులు, దండు అంజ య్య, కనకం అంజిబాబు, ఎలగందుల భిక్షపతి, రుద్రరాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

మల్యాల, మార్చి 8: కొండగట్టు అంజనేయస్వామిని శుక్రవారం సిరిసిల్ల జిల్లా వేములవాడ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, బాహుబలి సినిమా డైరెక్టర్ రాజమౌళి తండ్రి, సినీ రచయిత విజయేంద్రప్రసాద్ వేర్వేరు గా దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన అనం తరం ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా సత్కరించారు. ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

రేపు రాష్ట్ర బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 8: జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ జూనియర్స్ బేస్ బాల్ జట్ల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్ల హరిశంకర్, మహ్మద్ యూనిస్ పాషా తెలిపారు. బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ ఎంపిక పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను పంజాబ్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్లకు ఎంపిక చేయనున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

తాట్లవాయిలో యువకుడి దారుణ హత్య

- దుండగులు బలమైన ఆయుధంతో చంపి..
బావిలో పడేసినట్లు అనుమానం

రాయికల్, ఫిబ్రవరి 8: రాయికల్ మండలంలోని తాట్లవాయిలో శుక్రవారం దారుణం జరిగింది. గ్రామానికి చెందిన నాగెల్లి సురేష్(24) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు బలమైన ఆయుధంతో దారుణంగా హతమార్చి వ్యవసాయ బావిలో పడేసి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7న ఉదయం పొలానికి వెళ్తున్నానంటూ ఇంట్లోంచి బయటకు వెళ్లిన సురేష్ శుక్రవారం బావిలో శవమయ్యాడని కుటుంబీకులు రోదిస్తూ తెలిపారు. ఇంట్లోంచి పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన సురేష్ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు శుక్రవారం పొలం వద్ద వెతికారు. బావి సమీపంలో మృతుని ద్విచక్ర వాహనం, చెప్పులు లభించాయి. దీంతో కంగారుపడిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చి బావి చుట్టూ గాలించగా బావి వద్ద రక్తపు మరకలు కనబడటంతో బావిలో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తొలగించగా మృతదేహం లభించింది. గుర్తు తెలియని దుండగులు సురేష్‌ను బలమైన ఆయుధంతో తలపై దాడి చేసి చంపి అతని వ్యవసాయ బావిలోనే పడవేసి ఉంటారని భావిస్తున్నారు. మృతుని తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం కాగా, సురేష్ చిన్నవాడు. బావిలో నుంచి శవాన్ని బయటకు తీయగా మృతుని శరీరంపై చాలా చోట్ల గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. కాగా పూర్తి స్థాయి విచారణ జరిపి హత్య వివరాలు వెలికితీయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంఘటనా స్థలం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్‌లు సందర్శించారు. హత్య వ్యవహారంపై క్షేత్ర స్థాయిలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.


సురేష్(ఫైల్)


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

నేతన్నలకు ఉపాధిని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, మార్చి 8: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమల సమస్యలను పరిష్కరించడంతోపాటు ఆసాములు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలని ఈ నెల 11న సిరిసిల్లలో రాస్తారోకో చేస్తామని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మరమగ్గాల, అనుబంధ రంగాల యూనియన్ ముఖ్య నాయకులతో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుతం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వస్త్ర పరిశ్రమపై ఆధారపడి పనిచేస్తున్న నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మికుల ఇబ్బందులపై చర్చించారు. ఉపాధి సమస్యను పెద్దఎత్తున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికి పనులు కల్పించేందుకు భవిష్యత్తు పోరాట కార్యచరణ రూపొందించామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 11న సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మరమగ్గాలు, అనుబంధరంగాల కార్మికులతో కలిసి రాస్తారోకో చేపట్టాలని నిర్ణయించామని రమేష్ ప్రకటించారు. కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని రమేష్ కోరారు. సమావేశంలో నాయకులు నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం , ఉడుత రవి, కుమ్మరికుంట కిషన్, బెజుగం సురేష్, ఓగ్గ గణేష్, ఎలిగేటి శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల బకాయిలను విడుదల చేయాలి

- మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, మార్చి 8: బతుకమ్మ చీరలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆర్డర్ ఇవ్వడం లేదో చెప్పాలని రూ. 200 కోట్లు బకాయిలను వెంటనే విడదల చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణలో పనులు లేక ఒకప్పుడు పవర్‌లూం నేత కార్మికవర్గాలు భీవండి, సూరత్, షోలాపూర్, ముంబాయికి బతుకు దెరువు కోసం వెళ్లిన చరిత్ర ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్టు, రాజీవ్ విద్యామిషన్ ద్వారా స్కూల్ పిల్లలకు యూనిఫాంలకు దాదాపు 3,400 కోట్ల ఆర్డర్‌ను ఇచ్చి కార్మికులకు పని కల్పించారన్నారు. కేసీఆర్ పేద మహిళలకు చీరను బహుమతిగా ఇవ్వాలని బతుకమ్మ చీరలను తీసుకొచ్చారన్నారు. బతుకమ్మ చీరలకు ప్రభుత్వం ఎందుకు ఆర్డర్ ఇవ్వడం లేదో చెప్పాలని, దాదాపు కోటి 5లక్షల చీరలు అవసరం ఉంటుందని వెంటనే బతుకమ్మ చీరలకు ఆర్డర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదీ వరకు బతుకమ్మ చీరల బకాయిలు రూ. 200 కోట్లు విడదల చేయకపోయిన బతకమ్మ చీరలకు ఆర్డర్ ఇవ్వకపోతే మార్చి 15న సిరిసిల్లలో వేలాది కార్మికులతో మహాధర్నా చేపడతామన్నారు. ముఖ్యమంత్రి వద్ద కేకే మహేందర్‌రెడ్డికి పరపతి ఉంటే బకాయిలు, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు రాపెల్లి దినేష్, గెంట్యాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతులు కల్యాణం



ఎల్లారెడ్డిపేటలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 8: మహాశివరాత్రి వేడుకలు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, అక్కపల్లి, కోరుట్లపేట, బొప్పాపూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి, గొల్లపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివన్నామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అక్కపల్లి, గొల్లపల్లి, నారాయణపూర్, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శివపార్వతుల కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. దంపతులు, భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా బుగ్గ రాజరాజేశ్వరస్వామి కల్యాణం

రుద్రంగి, మార్చి 8: మండల కేంద్రం శివారులో ఆటవీ ప్రాంతంలో వెలసిన బుగ్గ రాజరాజేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం శివరాత్రికి ఆలయంలో ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శివ భక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గంగం స్వరూపరాణిమహేష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలతమనోహర్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి మాట్లడూతూ శనివారం స్వామి వారి జాతర నిర్వహిస్తామని, భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



రుద్రంగిలో స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఓం నమశ్శివాయ

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాల్లో లింగోద్భవం, రుద్రాభిషేకం, బిల్వార్చనలు
- శివభక్తుల మాలవిరమణ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బోళా శంకరుడు నామస్మరణ.. హరహర మహదేవ అంటూ భక్తి శ్రద్ధలతో జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తిభావంతో పులకించిపోయాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినవేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో శివాలయాలు కిటకిటలాడాయి. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి జిల్లా కేంద్రం నుంచి పాదయాత్రగా వేలాది మంది భక్తులు తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు, ఆరాధనాలతో భక్తి భావం ఉప్పొంగింది. ఉపవాసం, జాగరణతో రాజరాజేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అభిషేకప్రియుడు, బోళాశంకరుడి అనుగ్రహం కోసం భక్తితో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. సిరిసిల్లలోని అతిపురాతనమైన రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిరంతర జలాభిషేకం అఖండ దీపారాధన, లింగోద్భవం, రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. విశ్వనాథ ఆలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు, లింగోద్భవం, రుద్రహోమం నిర్వహించారు. ప్రతి ఇంటిలో శివుడికి ప్రీతికరమైన శివరాత్రి పర్వదినాన్ని ఉపవాస దీక్షతో గండదీపాన్ని వెలిగించుకొని జాగరణలు చేశారు. శివదీక్షదారులు మాలవిరమణ చేశారు. సిరిసిల్లలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణితో పాటు పలువురు నాయకులు రాజరాజేశ్వర శివాలయంలో దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ సత్కరించింది. జిల్లాలోని వేములవాడ క్షేత్రంతోపాటు సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఇల్లంతకుంట, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, బోయిన్‌పల్లి, మండలాల్లో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముస్తాబాద్: మండలకేంద్రంతోపాటు, పలు గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి, ఆయా గ్రామాల్లోని పురాతన ఆలయాల్లో భక్తులు ఉపావాస దీక్షలు చేశారు. ఉదయం నుంచి రాత్రివరకు ఆలయాలు కిటకిటలాడాయి. శివాలయాల్లో భక్తులు పోటెత్తి ఆధ్యాత్మిక చింతన చాటుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం, జంగమయ్యగుట్ట శివాలయం, సముద్ర లింగాపూర్‌లోని బ్రహ్మంగారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి పూలు, పండ్లు, ఫలహారాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాసం, భక్తి కీర్తనలు, శివుడి నామస్మరణతో శివాలాయలు మార్మోగిపోయాయి. శివపార్వతుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. మహిళలు మంగళహారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. గంభీరావుపేటలో శుక్రవారం రాత్రి బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో శివరాత్రి పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఇల్లంతకుంట: మండలంలో శివరాత్రి వేడుకలు భక్తి ప్రపత్తుల మధ్య కొనసాగాయి. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు సాయంత్రం ఇళ్లలో దీపాలు వెలిగించి ఆలయాలకు చేరుకున్నారు. జంగమరెడ్డిపల్లెలోని రామలింగేశ్వరస్వామి, ఇల్లంతకుంటలోని గంగాధర క్షేత్రం, వల్లంపట్ల, అనంతారం, గాలిపల్లి, అనంతగిరి తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ నిర్వహించారు. ఆలయాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన దీపాలను భక్తులు వెలిగించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని తాడూరు బస్వాపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లో శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తంగళ్లపల్లి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తాడూరు దేవాలయంలో శివపార్వతులను శోభాయాత్ర, కల్యాణం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తమ మొక్కులను తీర్చుకున్నారు.



సిరిసిల్ల శివాలయంలో ప్రత్యేక అలంకరణ

కోనరావుపేట: మండలంలోని కోనరావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్, ధర్మారం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివకల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారలను దర్శించుకున్నారు.

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామంలోని త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. రత్నంపేట గ్రామంలో లింగార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాల్లోని పరమశివుడిని ప్రజలు దర్శించుకొని పూజలు నిర్వహించారు.

చందుర్తి: మండలంలోని ఎన్గల్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నర్సింగాపూర్ మల్లికార్జునస్వామి ఆలయంతో పాటు చందుర్తి, మల్యాల గ్రామంలోని మార్కండేయస్వామి ఆలయం లో శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడపల్లి రాజరాజేశ్వరస్వామివారి ఆలయంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వేళల్లో జాగరణ పాటించారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.



సిరిసిల్ల శివాలయంలో భక్తులు



కోనరావుపేటోల శివ కల్యాణంలో పాల్గొన్న భక్తులు



తాడూరు శివాలయంలో బారులుదీరిన భక్తులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సిరిసిల్ల రూరల్, మార్చి 8: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాకమిటీ మాజీ అధ్యక్షుడు తమ్మెట జీవన్ ఆధ్వర్యంలో పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు వాణిశ్రీ, కల్పన, వీణ, రమాదేవి, నవ్య, ప్రణయ, స్రవంతి, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, మధ్యాహ్న భోజన కార్మికులు సుగుణ, పుష్ప, మమత, లక్ష్మీ, భూమమ్మలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షుడు ఉత్తం విజయ్‌కుమార్, ఉపాధ్యా యులు శ్రీనివాస్, గణేష్, మహేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.





పెద్దూర్ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం, తాడూరులో మహిళలను సన్మానిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామంలో మహిళా దినోత్స వం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, తాడూరు గ్రామ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు బర్కం లక్ష్మీనవీన్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆసాని లావణ్యరామలింగారెడ్డి, మండల అధ్యక్షులు కోడం భవత, కలికోట కాశీచరణ్, మంచుకట్ల ప్రసాద్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చర్లపల్లి రవి గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జంగం కిషన్, జూకంటి అఖిల్, బోయ రాజు, తోట రాజు, కన్నె అరుణ్ తదితరులు పాల్గొన్నారు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం జగదాంబతండాలో మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని బేటీ బచావో, బేటీ పడావో అంటూ ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ తీశారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలను ఖండిస్తు స్త్రీలను గౌరవించాలని నినదించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు, ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'దేవాలయ, ప్రభుత్వ భూములు ఆక్రమణ'

సిరిసిల్ల టౌన్, మార్చి 8: పట్టణంలోని దేవాలయ భూములు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని సర్వే నంబర్ 1580, 1560లలో టీఎల్‌పీటీఎస్ 035757/2023 ద్వారా అక్రమ లే అవుట్ పొందిన వ్యక్తులు సర్వే నంబర్ 1563లోని విశ్వనాథస్వామి ఆలయానికి చెందిన 22 గుంటల భూమి, దానిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ నాలాల 10 నుంచి 15 గుంటల స్థలం, సర్వే నంబర్ 1581లో ప్రభుత్వ భూమి రెండెకరాల్లో 10గుంటలు శాంతినగర్ రోడ్డుకు పోను మిగిలిన భూమిని కబ్జా చేసి ప్లాటింగ్‌లో కలుపుకొని అమ్మటానికి కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నంబర్ 1563 దేవాదాయ భూమి 22 గుంటలు హద్దులు వేసి ఫినిషింగ్ చేసి రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవాలయం భూమి, ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా కూడా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ దీనిపైన దృష్టి సారించి ఆలయ భూములను, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు లక్ష్మణ్, సోమ నాగరాజు, అజ్జ వేణు పాల్గొన్నారు.

శివోహం

మహాశివరాత్రి వేడుకలో భాగంగా వేములవాడ జనసంద్రమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఉదయం నుంచి పవిత్ర స్నానాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. రోజంతా ఉపవాసం ఉన్న భక్తులు రాత్రి గండ దీపం వెలిగించి జాగరణ చేశారు. జాత్రా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.



ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

శివార్చన కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న భక్తులు

జాగరణ పాటిస్తున్న భక్తులు

ఎంపీ బండి సంజయ్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

ఆలయ ఆవరణలో భోజనాలు చేస్తున్న భక్తులు

సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న భక్తులు